స్మితా సబర్వాల్‌కు నోటీసులు సరికాదు

ఎమ్మెల్యే దానం నాగేందర్

హిమాయత్ నగర్,ఏప్రిల్22 : హెచ్‌సీయూ అంశంపై ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన రీపోస్టు ట్వీట్ పై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. స్మితా సబర్వాల్ చేసిన ట్వీట్‌లో వాస్తవాన్ని తెలియజేశారని, ఆమెకు పోలీసులు నోటీసులు ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. వెంకటేశ్వర కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో హిమాయత్‌నగర్‌డివిజన్‌కు సంబంధించిన జీహెచ్‌ఎంసీ, జలమండలి, వివిధ శాఖల అధికారులు మంగళవారం స్థానిక సమస్యలపై సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే దానం దృష్టికి తీసుకువెళ్లగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంబర్‌పేట సర్కిల్-18 డీసీ మారుతి దివాకర్, ఏఎం హెచ్‌వో డాక్టర్ హేమలత, యుసీడీ అధికారి రజిత రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి కిష్టయ్య, రామ్ కి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

26న ఓయూ ఆవిర్భావ దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆవిర్భావ వేడుకలకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ఈనెల 26న జరగనున్న 108వ ఆవిర్భావ దినోత్సవ వాల్‌పోస్టర్‌ను మంగళవారం రిజిస్ట్రార్, ఓఎస్డీ, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, డైరెక్టర్లతో కలిసి ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ.. విద్య, పరిశోధనా రంగాల్లో ఓయూ ప్రపంచ వ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి పబ్లిక్ అఫైర్స్ సలహాదారు, ఓయూ పూర్వ విద్యార్థి కె. కేశవ రావు ముఖ్య అతిథులుగా, ఓయూ పూర్వవిద్యార్థి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ఓయూ వ్యవస్థాపకుడునిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ మనవడు, నవాబ్ మీర్ నజఫ్ అలీ ఖాన్ గౌరవ అతిథులుగా పాల్గొంటారని చెప్పారు.

ఆర్ట్స్‌కళాశాలకు అరుదైన ఘనత

ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల భవనం మరో అరుదైన ఘనత సాధించింది. దేశంలోని ప్రసిద్ధ ట్రేడ్ మార్క్ భవనాల జాబితాలో చోటు దక్కించుకుంది. దేశంలోనే ముంబై తాజ్ హోటల్, స్టాక్ ఎక్స్ఛేంజ్ తరువాత ట్రేడ్ మార్క్ కలిగిన మూడో కట్టడంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల భవనం నిలిచింది. ఈ మేరకు ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాన్ని ఓయూ పూర్వ విద్యార్థి సుభజిత్ సాహా ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్‌కు అందించారు.

నిమ్స్‌లో పటాకులు నిజమే

- ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పటాకులను తాను చూశానంటూ డైరెక్టర్‌కు వైద్యాధికారి ఫిర్యాదు
- ఆ వీడియోలు తానే తీశానంటూ ఏసీపీకి వాంగ్మూలం
- నలుగురు ఆరోగ్యశ్రీ సిబ్బందిని విచారిస్తున్న పంజాగుట్ట పోలీసులు
- అమాయకులపై నెట్టివేసేందుకు ప్రయత్నాలా...?

ఖైరతాబాద్, ఏప్రిల్ 22 : నిమ్స్‌లో పటాకుల కేసు రోజుకో మలుపుతిరుగుతోంది. ఈ నెల 19న నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలోని ఐదో అంతస్తులోని ఆడిటోరియంలో అగ్ని ప్రమాద ఘటన చోటు చేసుకోవడం విదితమే. అయితే ఇదే ఘటనలో ఆసుపత్రిలో పటాకులు సైతం బయట పడటంతో దవాఖానలోని భద్రతా వైఫల్యం వెలుగు చూసింది. ఇప్పటికే ఈ ఘటనలపై పంజాగుట్ట పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తుండగా, అగ్ని ప్రమాదానికి మాత్రం సిగరెట్లు, బీడీలే కారణమని ధృవీకరించారు. ఇక పటాకుల కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా వాటిని మాయం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనికి తోడు ఐదో అంతస్తులో కనీసం సీసీ కెమెరాలు లేకపోవడంతో ఈ కేసును ఎటు తేల్చాలో అర్థం కాక పోలీసు అధికారులు తలలుపట్టుకొని కూర్చోగా ఓ అధికారి ఇచ్చిన వాంగూల్మం వారి కేసుకు బలం చేకూర్చినట్లు తెలుస్తోంది. ఇప్పుడు కేసులో పురోగతి వచ్చినట్లైంది.

ఆస్పత్రుల్లో పటాకులు చట్టవిరుద్ధం...

పటాకులకు చట్టాలు పలు పరిధులు ఉంచాయి. అసురక్షితమైన పద్దతుల్లో వాటిని భద్రపర్చవద్దు. నిబంధనలకు లోబడి ఆస్పత్రులు, విద్యాలయాల్లో పటాకులను ఉంచకూడదు. ఎక్స్‌ప్లోజివ్ రూల్స్-2008 ప్రకారం.. ఆస్పత్రులు ప్రొటెక్టెడ్ వర్క్ పరిధిలోకి వస్తాయి. అంతేకాకుండా దవాఖానల్లో పటాకులు కాల్చడం కూడా తప్పవుతుందంటున్నారు. అలాంటిది ఆసుపత్రిలో పటాకులు నిల్వ ఎలా ఉంచుతారన్నారు. ఈ విషయాలను సదరు వైద్యాధికారి డైరెక్టర్‌కు ఇచ్చిన లేఖలో పొందుపర్చడం గమనార్హం.

ఆ వీడియోలు నిజమే...

నిమ్స్ ఆడిటోరియంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన సమయంలో దానికి ఆనుకొని ఉన్న ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పటాకులు దర్శనమిచ్చాయి. నిమిషాల వ్యవధిలోనే దానికి సంబంధించిన ఆ వీడియోలన్నీ ప్రసార మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అక్కడికి చేరుకోగా, గంటల వ్యవధిలోనే అవి మాయయ్యాయి. కాగా, అవన్నీ ఫేక్ వీడియోలని తేల్చే పనిలో నిమ్స్‌లోని ఓ వైద్యాధికారి ఉండగా, ఆ వీడియోలు తానే తీశానంటూ మరో వైద్యాధికారి నిమ్స్ డైరెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడమే కాకుండా.. నేరుగా పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసు ఉన్నతాధికారికి సైతం వాంగ్మూలం ఇచ్చారు. దీంతో పటాకుల కేసులో కొత్త ట్విస్టు నెలకొంది. ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పటాకులున్నట్లు తనకు సమాచారం రావడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లి వీడియోలను తీసి సాక్షాలను సేకరించానని సదరు అధికారి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో అసలు దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నలుగురు సిబ్బందిని విచారిస్తున్న పోలీసులు

ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పటాకుల కేసులో వైద్యాధికారి ఇచ్చిన వాంగూల్మం పోలీసుల దర్యాప్తునకు బలం చేకూర్చింది. అయితే దీపావళికి ఎనిమిది నెలలు ఉండగానే ఇక్కడ పటాకులు స్టాకు చేసుకోవాల్సిన అసరం ఎవరికి వచ్చింది.. లేక గతేడాది పండుగ కోసం తెచ్చినవా....పెద్దల ఫంక్షన్ల కోసం ఎవరైనా తెచ్చి పెట్టుకున్నారా అన్నది ఇంకా తేలలేదు. సాధారణంగా నిమ్స్‌లోని పలు వార్డుల్లో సిబ్బంది నైట్ డ్యూటీలు సైతం చేస్తుంటారు. అయితే అక్కడ పటాకులు రావడానికి ఆ సిబ్బందే కారణమై ఉంటారని భావించారేమో... ఇప్పటికే ఓ వైద్యాధికారి ఆరోగ్యశ్రీ సిబ్బందికి కొన్ని ప్రశ్నలతో మల్టిపుల్ చాయిస్‌లో అకనాలెడ్జిమెంట్ లేఖలు సైతం అందించినట్లు సమాచారం. కాగా, ఈ కేసును కొందరు అమాయక సిబ్బందిపై నెట్టివేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నలుగురు ఆరోగ్యశ్రీ సిబ్బందిని మాత్రం పోలీసులు విచారిస్తుండగా, అసలు దొంగ ఎవరో పోలీసులు నిగ్గు తేల్చాల్సి ఉందంటున్నారు.

న్యాయం చేయకుంటే సీఎం ఇల్లు ముట్టడిస్తాం

తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ రెడ్డి

హిమాయత్ నగర్,ఏప్రిల్ 22: విశ్రాంత ఉద్యోగులకు కేటాయించిన ఇండ్ల స్థలాలను వెంటనే ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురెల్లి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూము అశోక్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో 1991లో అప్పటి ప్రభుత్వం గోపన్నపల్లి గ్రామంలోని సర్వే నెం 36, 37లో 427 ఎకరాలను కేటాయించడంతో సభ్యత్వం దామాషా ప్రకారం నాలుగు సంఘాలు పంచుకోగా ఇందులో బీటీఎన్జీవో గచ్చిబౌలి మ్యాక్ హౌసింగ్ సొసైటీకి 189 ఎకరాలు వచ్చిందని తెలిపారు. అయితే తమకు కేటాయించిన ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఏళ్లుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయని పక్షంలో త్వరలో సీఎం ఇల్లును ముట్టడిస్తామని హెచ్చ రించారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి గొట్ల సూర్యకళ, కోశాధికారి జె ప్రకాష్ రావు , ఉపాధ్యక్షురాలు జాన్సీరాణి, సహాయ కార్యదర్శులు కటకం జానకి, పవన్ కుమార్, శ్రీదేవి, యాదగిరి, సభ్యులు.. లక్ష్మణ్ రావు, రుద్రమ్మ పాల్గొన్నారు.

జోయాలుక్కాస్ గోల్డెన్ ప్రాస్పెరిటి కాంపైన్

సిటీబ్యూరో, ఏప్రిల్22, (నమస్తే తెలంగాణ): ప్రముఖ జ్యువలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ అక్షయ తృతీయ -2025 సందర్భంగా "గోల్డెన్ ప్రాస్పెరిటి" కాంపైన్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 19 నుండి మే 1, 2025 వరకు కొనసాగనున్న ఈ పండుగ ఆఫర్లలో భాగంగా వినియోగదారులకు ఉచిత బహుమతులు అందుబాటులోకి తెచ్చారు. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన డైమండ్, అన్ కట్ డైమండ్ మరియు ప్లాటినమ్ జ్యువలరీ కొనుగోలు చేసిన కస్టమర్లకు 500 మి.గ్రా 24 క్యారెట్ల గోల్డ్ బార్ ఉచితంగా లభిస్తుంది. అలాగే రూ. 1.5 లక్షల డైమండ్ లేదా ప్లాటినమ్ ఆభరణాల కొనుగోళ్లపై 1 గ్రాము 24 క్యారెట్ల గోల్డ్ బార్ లేదా లక్ష్మీ విగ్రహం ఉచితంగా అందిస్తున్నారు. ఏప్రిల్ 30న జోయాలుక్కాస్ షోరూంలను సందర్శించిన కస్టమర్లు రూ.75వేలు విలువైన గోల్డ్ జ్యువలరీ కొనుగోలు చేస్తే ఉచితంగా 200 మి.గ్రా (22 కె) గోల్డ్ కాయిన్ పొందవచ్చు. అలాగే రూ.10 వేలు పైగా విలువైన సిల్వర్ జ్యువలరీ కొనుగోలు చేసిన వారికి 5 గ్రాముల సిల్వర్ కాయిన్ ఉచితంగా లభిస్తుంది. జోయాలుక్కాస్ 10% అడ్వాన్స్ ప్రీ-బుకింగ్ ఆఫర్‌ను అందించడమే కాకుండా, గోల్డ్ రేటును 30 ఏప్రిల్ 2025 వరకు లాక్ చేసే అవకాశాన్ని కూడా కల్పిస్తోంది. పాత గోల్డ్ ఎక్స్ఛేంజ్‌పై 0% డిడక్షన్ ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి.

నారాయణ ఆల్‌టైమ్ రికార్డు

ఇంటర్ బోర్డు చరిత్రలో వరుసగా రెండోసారి అత్యుత్తమ మార్కులు కైవసం

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) ఇంటర్ ఫలితాలలో నారాయణ విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో అత్యధిక మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని ఆ కాలేజీ డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, శరణి నారాయణ, కోర్ కమిటీ సభ్యురాలు రమా నారాయణ.. విద్యార్థులను అభినందించారు. అత్యుత్తమ విద్యాప్రమాణాలకు నారాయణ పెట్టింది పేరని తమ విద్యార్థులు మరోసారి రుజువు చేశారని వారు అన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో పి.వర్షిణి 470 మార్కులకు 469 మార్కులతో స్టేట్ ఫస్ట్ మార్కుతో చరిత్ర సృష్టించగా, 13 మంది 468 మార్కులు, 487 మంది 467 మార్కులు, 856 మంది 466 మార్కులు సాధించి విజయదుందుభి మోగించిందన్నారు. అలాగే సీనియర్ ఎంపీసీలో 1000 మార్కులకు 13 మంది విద్యార్థులు 995 మార్కులు, 30 మంది 994 మార్కులు, 74 మంది 993 మార్కులు, 106 మంది 992 మార్కులు సాధించి నారాయణ సత్తాను చాటారన్నారు. బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో 440 మార్కులకు 13 మంది 438 మార్కులు, 27 మంది 437 మార్కులు, 44 మంది 436 మార్కులు, 34 మంది 435 మార్కులు సాధించారని అన్నారు. బైపీసీ రెండో సంవత్సరంలో ఇద్దరు విద్యార్థులు 995 మార్కులు, నలుగురికి 984 మార్కులు అన్ని విభాగాలలో టాప్ స్కోర్‌ను సాధించారని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్ హెచ్.పి.జిలోనూ నారాయణ విజయప్రస్థానం కొనసాగిందన్నారు. 475 మార్కులకు గాను 470 మార్కులు ఒకరికి, 469 మార్కులు ఒకరికి, 468 మార్కులు నలుగురికి, 467 మార్కులు ఏడుగురు, సీనియర్ హెచ్.పి.జి విభాగంలో స్టేట్ టాప్ మార్కు 988 మార్కులు నారాయణ విద్యార్థి కైవశం చేసుకున్నారని తెలిపారు. అలాగే ముగ్గురు 985 మార్కులు, నలుగురు 984 మార్కులతో టాప్ మార్కులు సాధించారని, అన్ని విభాగాలలో నారాయణ విద్యార్థులే టాప్ మార్కులను కైవసం చేసుకున్నారని , ఈ స్థాయి ఫలితాలు నారాయణ తప్ప మరి ఏ ఇతర సంస్థ సాధించలేదని అన్నారు. ఈ సందర్భంగా రమా నారాయణ మాట్లాడుతూ.. జూనియర్ ఇంటర్‌లో ఆల్‌టైమ్ హయ్యస్ట్ మార్కులు వరుసగా రెండవ సారి నారాయణ సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఆరంభం నుంచి ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌ను పటిష్టమైన మైక్రో షెడ్యూల్‌సగా రూపొందించి కాన్సెప్ట్యువల్ ఓరియంటేషన్‌లో విద్యాబోధన చేయడం వల్లనే విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించగలుగుతున్నారన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన తమ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి నారాయణ విద్యా సంస్థల తరపున అభినందనలు తెలిపారు.

స్టార్టప్‌లకు హైదరాబాద్ అనుకూలం

కేంద్రమంత్రి జితేంద్రసింగ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు హైదరాబాద్ ఎంతో అనుకూలమని, సమర్థవంతమైన మానవ వనరులు, ఆవిష్కరణలకు వేదికగా ఉందని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ప్రశంసించారు. మంగళవారం సీఎస్ఐఆర్ ల్యాబోరేటరీల ఆధ్వర్యంలో హబ్సిగూడలోని ఐఐసీటీలో ఏర్పాటు చేసిన స్టార్టప్ కాంక్లేవ్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా నేపథ్యంలో దేశంలో పారిశ్రామిక విప్లవానికి బీజం పడిందన్నారు. 2014లో 50 స్టార్టప్‌లు ఉంటే, ప్రస్తుతం 10వేలకు పైగా స్టార్టప్‌లు, అందులో 3వేల మందికిపైగా యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలే ఉన్నారని కొనియాడారు. సదస్సులో భాగంగా 50కిపైగా స్టార్టప్‌లు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. కార్యక్రమంలో సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి, ఐఐసీటీ డైరెక్టర్ డా. శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ ప్రకాష్ కుమార్, ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు పూర్తి

రిటర్నింగ్ అధికారి అనురాగ్



జయంతిసిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 112 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, రెండు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందితో పాటు మరికొంత మంది సిబ్బందిని రిజర్వ్‌లో పెట్టామని చెప్పారు. దాదాపు 500 మంది అధికారులు, సిబ్బంది ఎలక్షన్ డ్యూటీలో పాల్గొంటారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి రూల్స్‌లో మార్పులు అవసరం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

చిక్కడపల్లి, ఏప్రిల్ 22: సమగ్ర భూ సర్వే నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పీ జంగారెడ్డి అధ్యక్షతన 'భూభారతి చట్టం భూసమస్యలన్ని పరిష్కరిస్తుందా?' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. భూ భారతి రూల్స్‌ను లోతుగా విశ్లేషిస్తే ఇంకా ఎన్ని మార్పులు చేయాలో అర్థమవుతుందన్నారు. భూమి క్రయ, విక్రయాల సందర్భంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి గతంలో లాగే స్లాట్ బుక్ చేయాలి. ఒకసారి బుక్ చేసి రిజిస్ట్రీ కాకపోతే, రెండో సారి బుక్ చేసినప్పుడు రూ.500 మూడో సారి బుక్ చేస్తే రూ.1000 రీ`షెడ్యూల్డ్ స్లాట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వారసత్వ రిజిస్ట్రేషన్‌కు భాగస్వాముల ''పరిష్కారపత్రం'' సరిపోతుందని భూ భారతిలో చెప్పారు. కానీ, రూల్స్‌లో వారసత్వ మ్యుటేషన్‌కు ఎకరాకు రూ.2500 మ్యుటేషన్ ఫీజు చెల్లించాలన్నారు. (గుంటకు రూ.62.50 పైసలు) పది ఎకరాల కుటుంబం రూ.25,000, మ్యుటేషన్ ఫీజు కింద చెల్లించాలి. పరోక్షంగా రిజిస్ట్రేషన్ ఫీజు కన్నా ఇది ఎక్కువ అని తెలిపారు. పేరు, సర్వే నెంబర్ల సవరణ, డిజిటల్ సంతకం సవరణ ఆ సమస్యకు సంబంధించిన భూమి మార్కెట్ విలువ రూ.5లక్షల లోపు అయినచో ఆర్‌డీఓకు, రూ.5లక్షలు దాటిన చో కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుత ధరల ప్రకారం భూముల ధరలు 75శాతం రూ.5 లక్షలకు పైన విలువ గలిగిన తగాదాలు ఉన్నాయని తెలిపారు. వీటి పరిష్కారానికి కలెక్టర్ దగ్గరకు వెళ్లాలి. రెవెన్యూ కోర్టులను (తహసీల్దార్, ఆర్‌డీఓ, కలెక్టర్) పునరుద్దరిస్తున్నామని చెబుతూనే బాధ్యతలన్నీ కలెక్టర్ పైన పెట్టారని వివరించారు. అందరూ కలెక్టర్ దగ్గరకు వెళ్లడం సాధ్యం కాదన్నారు.. తహసీల్దార్ రెవెన్యూ కోర్టుల్లోనే ప్రాథమిక పరిష్కారాలు జరిగేటట్లు రూల్స్‌ను సవరించాలి. వివిధ శాఖల కింద ఉన్న భూములను రెవెన్యూ శాఖలోకి మార్చి సమస్యలను పరిష్కరించాలి. రిటైర్డ్ సర్వే జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, సీనియర్ నాయకులు మల్లారెడ్డి ,రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రారెడ్డి, సహాయ కార్యదర్శి శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు, రాష్ట్ర కార్యదర్శి డీజీ నర్సింహారావు,తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ప్రభులింగం, సహాయ కార్యదర్శి డీజీ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయ్య, ఏఐకెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాచారం ప్రధాన రోడ్డు వెడల్పు పనులు చేపట్టండి



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్ ,ఏప్రిల్ 22 : నాచారం ప్రధాన రహదారిలో ఐఐసీటీ ఇనిస్టిట్యూట్ క్వాటర్స్ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డును వెడల్పు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌కు వినతి పత్రం అందజేసినఎమ్మెల్యే సమస్యపై కేంద్ర మంత్రికి విపులంగా వివరించారు. ప్రధానంగా నాచారంలో పెద్దపెద్ద స్కూల్స్ ఉండడం, చర్లపల్లి నూతన రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి కూడా ఇదే కావడం వల్ల నిత్యం ఈ ప్రధాన రహదారిపై వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఈసీఐఎల్, ఎన్ఎఫ్‌సీ కంపెనీలకు వెళ్లే వారు కూడా ఇదే దారిలో వెళ్తుంటారన్నారు. ఇదే కాకుండా ఐఓసీఎల్, బీపీసీఎల్ కంపెనీలతో అనేక పెట్రోల్,డీజిల్ ట్యాంకర్లు ఇదే దారి గుండా వెళ్తుంటాయన్నారు.సమస్యను విన్న కేంద్రమంత్రి తప్పకుండా రోడ్డు వెడల్పునకు సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, ఐఐసీటీ శ్రీనివాస్ రెడ్డి సీసీఎంబీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిధుల దుర్వినియోగం కేసులో..

ఆరు ఆసుపత్రులు సీజ్

ఆర్కే పురం, ఏప్రిల్ 22: ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు దుర్వినియోగం చేసిన ఆరు ఆసుపత్రులను సీజ్‌చేసినట్లు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం సరూర్‌నగర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హస్తినాపురంలోని డెల్టా హాస్పిటల్, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లోని బీడీరెడ్డి గార్డెన్స్ రోడ్డులోని శ్రీ రక్షా హాస్పిటల్, సాగర్ రింగ్‌రోడ్ సమీపంలోని హిరణ్యా హాస్పిటల్, బైరామల్‌గూడలోని మోహన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సాయి తిరుమల హాస్పిటల్, సరూర్‌నగర్ లోని ఎంఎంవీ ఇందిరా హాస్పిటల్, సాయి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ లలో నిబంధనలకు విరుద్ధంగా సీఎంఆర్ఎఫ్ నిధుల కోసం నకిలీ సర్టిఫికెట్స్ సృష్టించి ప్రభుత్వానికి దరఖాస్తు చేసారు. ఈవిషయం సాధారణ పరిపాలన విభాగం అధికారులు, సీఐడి విభాగం అధికారులు చేసిన విచారణలో బట్టబయలయింది. వీరి సూచన మేరకు డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్ఓ గీత శనివారం హాస్పిటల్స్‌ను సీజ్ చేసారు. ఇందులో హిరణ్య హాస్పిటల్, ఎం ఎం వి ఇందిరా హాస్పిటల్స్‌ను శనివారం సీజ్ చేయగా మిగిలిన నాలుగు హాస్పిటల్స్ ఇప్పటికే మూసివేశారు. ఫిర్యాదులు వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగంపై చర్యలు తప్పవన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

సిటీబ్యూరో, ఏప్రిల్22, (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు విజయభేరి మోగించాయి. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను 468 మార్కులను 103మంది సాధించగా, బైపీసీలో 440 మార్కులకు గాను 438 మార్కులతో 26 మంది ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకు గాను 996 స్టేట్ టాప్ మార్క్‌తో పాటు 995 పైన మార్కులతో ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ అభినందించారు.

ప్రమాదకరంగా కాలొరెక్టల్ క్యాన్సర్

డాక్టర్ గురు ఎన్ రెడ్డి

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 22: కాలొరెక్టల్ క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా మూడో అత్యంత సాధారణ క్యాన్సర్‌గా ఉందని కాంటినెంటల్ ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ దవాఖానాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొలొరెక్టల్ క్యాన్సర్ 10 శాతం క్యాన్సర్ కేసులకు కారణమని, క్యాన్సర్ మరణాలకు రెండవ ప్రధాన కారణమన్నారు. 50 సంవత్సరాలు వయసు పైబడిన వారు తప్పనిసరిగా కొలనోస్కోపి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 45 ఏళ్ల పైబడిన పురుషులు, కొలనోస్కోపీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించవచ్చన్నారు.

హ్యుందాయ్ ఔరా సీఎన్‌జీ వాహనాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

సీఎన్‌జీ వాహనాలతో కాలుష్య కట్టడి

హ్యుందాయి సౌత్ జోనల్ కోఆర్డినేటర్ యాంగ్వాన్ యూన్

బంజారాహిల్స్,ఏప్రిల్ 22: రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని కట్టడి చేయడంలో తమవంతు బాధ్యతగా సీఎన్‌జీ ఆధారిత హ్యుందాయ్ 'ఔరా' వాహనాలను భారీ ఎత్తున వినియోగించేలా కార్పొరేట్ సంస్థలకు బల్క్ డెలివరీలు అందజేస్తున్నామని హ్యుందాయ్ సౌత్ జోనల్ కోఆర్డినేటర్ యాంగ్వాన్ యూన్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని జేఎస్‌పీ హ్యుందాయ్ షోరూమ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏకకాలంలో 35 హ్యుండాయ్ ఔరా సీఎన్‌జీ మోడల్ కార్లను సూర్య ట్రావెల్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తికి అందజేశారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ఎక్కువ కాలుష్యాన్ని కలిగించే డీజిల్ వాహనాల వినియోగాన్ని నియంత్రించి సీఎన్‌జీ వాహనాలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో భారీ కార్పొరేట్ సంస్థలకు హ్యుందయ్ సీఎన్‌జీ వాహనాలను విక్రయిస్తున్నామన్నాని జేఎస్‌పీ హ్యుందయ్ ఎండీ పృథ్వీరెడ్డి అన్నారు. హ్యుండాయ్ జోనల్ హెడ్ కృపాశంకర్ మిశ్రా, రీజినల్ హెడ్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 29నుంచి హజ్‌యాత్ర

మైనార్టీ సంక్షేమ శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్

సిటీ బ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే హజ్ యాత్రకు శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఈనెల 29 నుంచి మే 29 వరకు విమాన సర్వీసులు అందుబాటులో ఉంటాయని మైనార్టీ సంక్షేమ శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాష అన్నారు. హజ్ హౌస్‌లో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో మంగళవారం ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ, ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర సహ పలురాష్ట్రాల నుంచి ఈ ఏడాది 11వేల మంది హజ్‌యాత్ర చేయనున్నట్లు తెలిపారు. మదీనాకు ఏప్రిల్ 29 నుంచి మే13 వరకు, జిద్దాకు మే 16 నుంచి మే 29 వరకు విమానాలు నడుస్తాయని తెలిపారు. జిద్దా నుంచి తిరిగి వచ్చే విమానాలు జూన్ 12 నుంచి జూలై 9 వరకు మధ్య నడుస్తాయని, 31 విమానాలు యాత్రికులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సజ్జాద్ అలీ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇర్ఫాన్ షరీఫ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేట్లబురుజు ఆసుపత్రిలో అరుదైన చికిత్స

పిత్తాశయం, గర్భ సంచి సమస్యలతో బాధపడుతున్న మహిళ

శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన వైద్యులు

సిటీబ్యూరో, ఏప్రిల్22, (నమస్తే తెలంగాణ): కడుపునొప్పి, మూత్రంలో మంటతో బాధపడుతున్న 46ఏళ్ల ఓ మహిళకు శస్త్రచికిత్స చేసి పిత్తాశయం, గర్భసంచి తొలగించిన అరుదైన ఘటన పేట్లబుర్జ్‌లోని మోడర్న్ గవర్నమెంట్ మెటర్నిటీ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. వివరాలు.. నేపాల్‌కు చెందిన 46 ఏళ్ల చందా థాపా అనే మహిళ సికింద్రాబాద్‌లో నివాసముంటోంది. కాగా ఆమెకు 3 నెలలుగా తీవ్ర కడుపునొప్పి, మూత్రంలో మంట కలగడంతో అనేక ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. అయినా కూడా నొప్పి తగ్గకపోవడంతో వారం రోజుల క్రితం పేట్లబుర్జ్‌లోని మోడర్న్ గవర్నమెంట్ మెటర్నిటీ ఆసుపత్రిలో చేరారు. వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె కడుపులో గడ్డ, పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. గైనకాలజిస్టు డాక్టర్ సుజాత హిస్టరెక్టమీ, యూనిలేటరల్ ఊఫొరెక్టమీ శస్త్రచికిత్స నిర్వహించి 1.6 కిలోల గర్భసంచి తొలగించగా, జనరల్ సర్జన్ డాక్టర్ రమేష్ చోలీసిస్టెక్టమీ శస్త్రచికిత్స చేసి 2.51సెంటీమీటర్ల రాళ్లుకలిగిన పిత్తాశయాన్ని తొలగించారు. రెండు శస్త్రచికిత్సలు ఏకకాలంలోనే విజయవంతంగా నిర్వహించి రోగిప్రాణాలు కాపాడారు.